# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 184 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 30 జూన్ 2026


## ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవి




## జిల్లా ఎస్పీ శబరిష్ తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ




## గ్రామీణాభివృద్ధి పథకాల్లో

# తెలంగాణ వెనకబాటు

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు




## ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్



**అమరావతి,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ముంబయి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయం, రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. మిగతా2లో...



## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

### అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ

### అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

**న్యూఢిల్లీ,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని మిగతా2లో...

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

**● రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ ● వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం ● డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క**



**ఖమ్మం,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మిగతా2లో...



## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

### ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ

**విక్టోరియా,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. మిగతా2లో...

## కేంద్రం సహకరిస్తేనే

# రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

- పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి
- 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు
- గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతక్క స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం మిగతా2లో...

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

- రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు




**హైదరాబాద్,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం మిగతా2లో...



## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

### - ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి 3 ట్రిలియన్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఒక జాతీయ ఆంగ్ల పత్రిక వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు మిగతా2లో...

## హరీష్ రావుకు మెంటల్

# బ్యాలెన్స్ తప్పింది

**● ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు- ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి ● ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు ● బిజేపిది ఆశకాదు.. అత్యాశ ● రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమచేస్తాం: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికార మిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. మిగతా2లో...

## జీవితం అంటే వందమీటర్ల

# పరుగుపందెం కాదు

### ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి

- వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ
- వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం
- తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి మిగతా2లో...

## ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలే కదా! అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు వరంగల్ అభివృద్ధి కోసం ఏం చేశాయో చెప్పాలి అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బిజెపి బూత్ అధ్యక్షుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ఏదైనా హామీ ఇస్తే..అమలు చేసే గ్యారెంటీ ఉందని, కాంగ్రెస్ లాగా ఆరు గ్యారెంటీలు ఇచ్చి మోసం చేసేది కాదు అని విమర్శించారు. మిగతా2లో...



# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నా రు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలి రావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నా రని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజ యవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ పక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్రమంత్రికి వివరించారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు.

# గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనకబాటు

**న్యూఢిల్లీ,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంపై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు.గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐకి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ జాతీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ పేర్కొన్నారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

(మొదటి పేజీ తరువాయి)

గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

5శాతం వాటాను అందిస్తోందని, 2047 నాటికి ఈ వాటాను 10?కి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు ? ఇందులో రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని, వీరికి ఈ ఏడాదే రూ. 21,000 కోట్ల రుణాలు అందించామని, ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల విశ్వాసానికి రెండు ప్రధాన అంశాలు కారణమని శ్రీధర్ బాబు అన్నారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు.

సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని, ఇప్పుడు సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్-టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. 1950-70వ దశకాలలో స్థాపించిన సంస్థల ఆధారంగా అభివృద్ధి చెందిన తెలంగాణ రక్షణ, ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

# ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసింది.. మోడీ సర్కార్ అని కాజీపేటకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ఇచ్చింది బిజెపి సర్కార్ అని తెలియజేశారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీని వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తామని, ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్ ఉంటుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.త్వరలోనే వరంగల్ విమానాశ్రయం పనులు ప్రారంభం అవుతాయని, రూ.19 కోట్లతో హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు సిమెంట్ జాతీయ రహదారి వేశామని అన్నారు. వరంగల్ కు 50 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం మంజూరు చేసిందని, వరంగల్ కు పిఎం మెగా టెక్స్ టైల్స్ పార్క్ మంజూరు చేసి ఇటీవలే ప్రారంభించారని చెప్పారు. సమ్మక్క-సారలమ్మ పేరుతో గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేసుకున్నామని, రూ. వెయ్యి కోట్లతో నిర్మించే గిరిజన వర్సిటీకి ప్రధాని త్వరలోనే శంకుస్థాపన చేస్తారని అన్నారు.

# ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

దీంతో వైద్య పరీక్షల నిమిత్తం ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి పవన్ వెళ్లనున్నారు. పవన్‌కళ్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.

# జిల్లా ఎస్పీ శబరిష్ తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ

**తొర్రూరు ప్రతినిధి, జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు డివిజన్లోని డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆకస్మికతనికి నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసు డైరీలు, విచారణలో ఉన్న పెండింగ్ కేసులు, పోక్సో కేసులు, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్ లో కేసుల ఆన్లైన్ నమోదు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నాణ్యతను పెంచుతూ, పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సీఐలు, ఎస్ఐలతో సమావేశమై ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమాచారాన్ని సేకరించాలని, నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం



ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్. చింతలపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామస్థులతో మమేకమైయ్యారు ఈ సందర్భంగా వారికీ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అవగాహన కల్పిస్తూ, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. గ్రామంలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. అదేవిధంగా రాత్రి వేళల్లో దొంగతనాల నివారణకు గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అత్యవసర సమాచారం, అనుమానాస్పద సంఘటనలు, భద్రతా హెచ్చరికలను వెంటనే పరస్పరం పంచుకునేం దుకు గ్రామ స్థాయిలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ లో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని, పోలీసులు,ప్రజల సమన్వయంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్. పేర్కొన్నారు.

---

# అధికారులకు శాలువాలు, బొకేలు... మర్యాదా? లేక అనవసర ఆర్భాటమా?

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:**

పరకాల నియోజకవర్గంలో ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభుత్వ అధికారులకు శాలువాలు కప్పడం, బొకేలు అందించడం, ఘనంగా సన్మానించడం ఆనవాయితీగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అవకాశం కోసం ఎదురుచూసే కొందరు వ్యక్తులు కొత్త అధికారి బాధ్యతలు చేపట్టగానే మర్యాద పూర్వకంగా కలవడం వరకు పరిమితమైతే అభ్యంతరం ఉండదని పలువురు అభిప్రాయపడు తున్నారు. అయితే అధికారి పనితీరు ఎలా ఉంటుందో తెలియకముందే అతిగా సన్మానాలు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల కోసం నిజాయితీగా పనిచేసిన తర్వాత అధికారులను అభినందించడం సహజమే కానీ, బాధ్యతలు చేపట్టిన తొలి రోజే శాలువాలు, బొకేలతో ఘన స్వాగతం పలకడం సరైన సంస్కృతేనా అని కొందరు మేధావులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగం, చట్టాల ప్రకారం తమ విధులను నిర్వర్తించడం వారి బాధ్యత. ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడు ప్రజల నుంచి గౌరవం, అభినందనలు లభించడం సహజం.

కానీ పనితీరును అంచనా వేయకముందే అతిగా సన్మానాలు చేయడం వల్ల ప్రజల్లో అనేక సందేహాలు తలెత్తే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. "ఈ శాలువాలు ఎందుకు? ఈ బొకేలు ఎందుకు? కేవలం మర్యాద కోసమా? లేక భవిష్యత్తులో వ్యక్తిగత ప్రయోజనాల కోసం ముందస్తు పరిచయాలు పెంచుకునేందుకా?" అనే ప్రశ్నలు కూడా సామాజిక వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. ఇలాంటి చర్యలు ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికతపై అనవసర అనుమానాలకు దారితీయవచ్చని కొందరు పేర్కొంటు న్నారు. అయితే ప్రతి సన్మానం వెనుక అవినీతి లేదా స్వార్థ ప్రయోజనం ఉందని చెప్పడానికి ఆధారాలు లేవు. చాలామంది నిజమైన మర్యాద, సామాజిక సంప్రదాయంలో భాగంగానే అధికారులను కలుస్తుంటారు. అదే సమయంలో, ప్రజాసేవలో మెరుగైన పనితీరు కనబరిచిన తర్వాత అధికారులను గౌరవిం చడం మరింత సముచితమని పలువురు మేధావులు సూచిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా, నిష్పాక్షికంగా పనిచేస్తేనే వారి పట్ల గౌరవం మరింత పెరుగుతుందని, శాలువాలు, బొకేల కంటే ప్రజల ప్రశంసలే వారికి నిజమైన సన్మానమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవి

**ఏ.పి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త**

**హైదరాబాద్, జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవని, ఇవి యువ తరాలను సృజనాత్మకంగా ఆలోచించడానికి, వ్యవస్థాపకతలో సాహసాలు చేయడానికి ప్రోత్సహిస్తాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త అన్నారు. ఆధినిక పరిశ్రమలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు మరియు ఆవిష్కరణల హబ్‌లను స్థాపించడం ద్వారా, వర్ధమాన పారిశ్రామికవేత్తలుగా అద్భుతమైన ఆలోచనలను అభివృద్ధి చేసి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చడంలో సహాయపడుతాయని తెలిపారు. హైదరాబాద్, మాదాపూర్, హైటెక్స్. నోవాటెల్ హోటల్ లో అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరమ్ జాతీయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారమహోత్సవం కార్యక్రమానికి టీ.జి. భరత్ గుప్త ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగల, పసుపు బోర్డు ఎండి భవాని శ్రీ, సీఎం ఓ.ఎస్.డి వేముల శ్రీనివాసులు, జీఎస్టీ కమీషనర్ సాయి కిషోర్, బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, టీజీవోఏ అధ్యక్షులు కృష్ణ మూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి లింగ మూర్తి లు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరం నూతన జాతీయ అధ్యక్షులుగా భవాని సురేష్ చారుగుండ్ల. ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ ఎర్రం,, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ పడకంటి, సంయుక్త కార్యదర్శిగా వంశీ నెలాంటి, కోశాధికారిగా శివ కుమార్ బొగ్గరి తో సహా 47 మంది జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం టీ జి. భరత్ జ్యోతి ని వెలిగించి సభను ప్రారంభించి, ఫోరమ్ పారిశ్రామిక ప్రదర్శన లోగో మరియు బ్రోచర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ అనేది ఆర్య వైశ్య సమాజానికి







చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు, వ్యాపార నాయకులను అనుసంధానించే ఒక జాతీయ వేదికగా ఏర్పడడం గర్వకారణం అని అన్నారు. ఈ ఫోరమ్ పరిశ్రమకు ఒక బలమైన గొంతుకగా ఉంటూ, భారతదేశ ఆర్థిక పురోగతి కోసం సంస్థలను మరియు భవిష్యత్ వ్యాపార నాయకులను శక్తివంతం చేయాలని అన్నారు. అలాగే ఆర్య వైశ్య సమాజానికి దాతృత్వం మరియు సామాజిక బాధ్యత విషయంలో సుదీర్ఘమైన సంప్రదాయం ఉందని దీనిని కొనసాగించాలని కోరారు. నేను రాజకీయ నేతతోపాటు యువ పారిశ్రామికవేత్తను కూడా అని, నన్ను కూడా ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ సభ్యత్వం ఇవ్వాలని, ఫోరమ్ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. వచ్చే సంవత్సరం ఫోరమ్ నిర్వహించే పారిశ్రామిక ప్రదర్శన కు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఫోరం నూతన అధ్యక్షులు భవాని సురేష్ చారుగుండ్ల మాట్లాడుతూ దేశంలోని తయారీ రంగంలో శ్రేష్ఠతను, సాంకేతిక పురోగతిని మరియు సుస్థిర వ్యాపార వృద్ధిని సాధించడానికి కట్టుబడి ఉన్న పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు మరియు తదుపరి తరం నాయకులను ఒకచోట చేర్చే ఒక చైతన్యవంతమైన వేదిక అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరం అని తెలిపారు. జ్ఞానం, నెట్‌వర్కింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం మరియు నాయకత్వ అభివృద్ధి ద్వారా వ్యాపారాలను బలోపేతం చేయడంపై మా దృష్టి ఉందని, అదే సమయంలో, భారత పరిశ్రమ భవిష్యత్తును తీర్చిదిద్దే తదుపరి తరం పారిశ్రామికవేత్తలను కూడా మేము ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ పూర్వ అధ్యక్షులు, వివిధ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాచాల యుగంధర్ గౌడ్



**హైదరాబాద్ జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో తిరుమల చేరుకున్న ఆయన సోమవారం ఉదయం స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తాం

**● హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది ● పాలకుర్తిలో మెగా జాబ్ మేళాలో ఎంపికైన యువతకు అపాయింట్మెంట్ లెటర్‌ను అందజేశారు. ● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు.**



**తొర్రూరు ప్రతినిధి ,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తిలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎంతోమంది యువతీ యువకులు ఈ జాబు మేళాకు హాజరు కాగా అందులో కొందరికి జాబ్ మేళాలో ఎంపికయ్యారు. పాలకుర్తి మెగా జాబ్ మేళాలో ఎంపికైన యువతకు సోమవారం అపాయింట్మెంట్ లెటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన వారికి ఎమ్మెల్యే యశస్వి రెడ్డి తోపాటు టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి నియామక పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్రెడ్డి ప్రసంగిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు యువత భవిష్యత్తుకు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# మల్లంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ల్యాద శ్యామ్‌రావు ఏకగ్రీవ ఎన్నిక



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలోని 10 గ్రామ పంచాయతీల సర్పంచులు సోమవారం సమావేశమై మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావును మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా భూపాల్‌నగర్ సర్పంచ్ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుత్తూరు తండా సర్పంచ్ రాజు నాయక్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ల్యాద శ్యామ్‌రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తానని, సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, హెల్త్ అండ్ మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబును సర్పంచులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి రామ్‌రెడ్డి, కుడిశెలకుంట సర్పంచ్ అనిత రామ్మోహన్‌రెడ్డి, గుత్తూరు తండా సర్పంచ్ రాజు నాయక్, రామచంద్రపురం సర్పంచ్ స్వరూప్ ప్రతాప్‌రెడ్డి, భూపాల్‌నగర్ సర్పంచ్ రమణారెడ్డి, శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, ముద్దునూరు తండా సర్పంచ్ వనిత రాజేందర్, శివతండా సర్పంచ్ భాస్కర్, దేవ్‌నగర్ సర్పంచ్ సంతోష్, మహ్మద్ గౌస్‌పల్లి సర్పంచ్ కార్తీక్, కక్కర్ల సాంబయ్య, షాపూర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్-2 డిపో ఆధ్వర్యంలో "డైల్ యువర్ డీఎం" కార్యక్రమం

**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 29 (పిసి డబ్ల్యూ న్యూస్ ):** వరంగల్-2 డిపో ఆధ్వర్యంలో మంగళవారం (30-06-2026) ఉదయం 10:00 గంటల నుంచి 11:00 గంటల వరకు "డైల్ యువర్ డీఎం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం. రవిచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాలోని ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు మండలాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని రవాణా సేవలకు సంబంధించిన తమ సలహాలు, సూచనలు మరియు ఫిర్యాదులను తెలియజేయవచ్చని కోరారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి 7382425150 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని డిపో మేనేజర్ ఎం. రవిచందర్ తెలిపారు. ఇట్లు,డిపో మేనేజర్వరంగల్-2 డిపో



# రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాది: మంత్రి తుమ్మల






**కల్లూరులో పరిపాలన, మౌళిక వసతుల కేంద్రాలను తీర్చిదిద్దుతాం**

**రైతు బలపడితేనే బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతం**

**సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులు తీసుకొస్తాం**

**కల్లూరులో ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) బ్రాంచి నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేసిన మంత్రి**

**కల్లూరు, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న మంత్రి, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు. కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం, అశ్వారావుపేట పాత



రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఎజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, మండల అధ్యక్షులు పోట్రూ అర్జున్ రావు, పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ, సీనియర్ నాయకులు బండి గుర్నాథ్ రెడ్డి, భాగం ప్రభాకర్, మాజీ ఎంపిటిసి అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏనుగు సత్యం బాబు, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు కిరణ్ కుమార్, సొసైటీ చైర్మన్లు, సొసైటీ సీఈవోలు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా స్నేహపూర్వక గ్రామ సభకు విశేష స్పందన

**- 200 మహిళా సభ్యురాలు హాజరు.**

**- గుర్తుర్ గ్రామంలో మినీ బ్యాంకులు ఏర్పాటు చేయండి. చిక్కుళ్ళపల్లి పద్మ.**

**- గ్రామ సంతను శుక్రవారం నుండి బుధవారానికి మార్చిన మహిళలు.**

**- అన్ని సమస్యలకు సానుకూలంగా స్పందించిన గ్రామ సర్పంచ్ వి, కవిత.**







**తొర్రూరు ప్రతినిధి,జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తురు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం మహిళా స్నేహపూర్వక గ్రామ సభను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వి కవిత హాజరయ్యారు. స్నేహ పూర్వక మహిళా గ్రామ సభకు సుమారు 200 మంది మహిళా సభ్యురాలు హాజరు అయ్యారు. గ్రామంలో మహిళలు పడుతున్న అవస్థలు వారికి కావలసిన మౌలిక సదుపాయాలు గ్రామంలో మినీ బ్యాంకు ఎంతో అవసరమని వీటికి తోడు ప్రధాన రహదారులలో వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిలబడి బురదమయం కావడంతో వృద్ధులు పాఠశాల విద్యార్థిని ,విద్యార్థులు వారితో పాటు పాదచారులు కూడా అనేక అవస్థలు పడుతున్న విషయాన్ని సభాముఖంగా మహిళలు గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ ఏడవ వార్డులో ప్రధాన రహదారి నడిరోడ్డులో కుళాయిలకు సంబంధించిన గేటు వాల్వును ఏర్పాటు చేయడంతో వర్షం వచ్చినప్పుడు గుంతనిండా నీరు చేరి గ్రామంలో అనేకమంది గాయాల పాలవుతున్నారని వెంటనే గేటు వాల్. అక్కడి నుండి మార్చాలని కోరారు. అలాగే గ్రామంలో మొత్తం 60 మహిళా గ్రూపులు ఉండగా వారు జమ చేసిన డబ్బులను కొండాపూర్ లోని కెనరా బ్యాంకుకు తీసుకు వెళ్ళటం అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తీసుకువెళ్లే వారికి సెక్యూరిటీ లేక అనుకోని విధంగా ఏమైనా జరుగుతే ఈ నష్టాన్ని ఎవరు భరించాలి అనేదానిపై గ్రామంలో ఏదైనా ఒక మినీ బ్యాంకు ఏర్పాటుచేయాలని, గ్రామంలోని మహిళలందరికీ వందరోజుల పని మినహా ఎలాంటి ఆదాయం లేదని మహిళా గ్రూపు సభ్యులకు ఏదైనా పని కల్పించేందుకు కొంత లోన్ గా ఇచ్చి వారికి సహకరించి ఆదాయం వచ్చే విధంగా చూడాలని దీనితోపాటు వారసంతలో కూడా గ్రామంలోని మహిళలకు ప్రథమ స్థానం కల్పిస్తూ వర్షాకాలం కావున వర్షం నీరు పడకుండా ఏదైనా ఏర్పాటు చేయాలని ఒక గ్రూపు సభ్యురాలు చిక్కుళ్ళపల్లి పద్మ కోరారు. మహిళలందరూ ఆమెకు సహకరించారు. కొన్ని వీధులలో విద్యుత్ స్తంభాలు సరిగా లేక ప్రమాద స్థాయికి విద్యుత్ తీగలు చేరి ఉన్నాయని వెంటనే వాటిని సరిచేసి గ్రామంలో ఎవరికీ ఆపద రాకుండా చూడాల్సిన బాధ్యత సర్పంచి పై ఉన్నదని మరో మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళలు వారికున్న సమస్యలపై సభాముఖంగా అధికారుల దృష్టికి తీసుకు వచ్చినందుకు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ ప్రసంగిస్తూ. గ్రామంలోని మహిళల్లో ఇన్ని సమస్యలు దాగి ఉన్నాయా స్నేహపూర్వక గ్రామసభను ఏర్పాటు చేయడంలో మహిళల్లో ఉన్న బాధలను వెళ్ళగొచ్చినందుకు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళలకు ఎలాంటి ఆదాయం లేక ఇళ్లకే పరిమితమైన జీవిస్తున్నాం అంటున్నారు దీనికి ఉదాహరణగా నిజాంబాద్ జిల్లా అంకాపూర్ గ్రామం లో గతంలో కూడా ఎవరికి ఉపాధి లేక వారు వారికి కూడా బ్యాంకు సదుపాయాలు లేకపోవడంతో గ్రూపు సభ్యులందరూ ఒకే మాటపై కట్టుబడి ఉండి స్వయంగా వారే మహిళా గ్రూపు మినీ బ్యాంకును ఏర్పాటు చేసుకోవడమే కాకుండా గ్రామంలో ఇటుకల తయారీ మరికొన్ని వస్తువుల తయారీ ఇలాంటివి తయారు చేసుకుంటూ రాష్ట్రంలోని ఆదర్శ గ్రామంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు రాంచరణ్ అలాంటి అంకాపూర్ కి తీసుకు వెళ్లేందుకు మేము సిద్ధంగా ఉన్నామని సీఈఓ గ్రూపుల తరఫున ఎందరు వచ్చిన మా ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి తీసుకువెళ్లి అక్కడ సమస్యలు ఏమిటి తెలుసుకునే అవకాశాన్ని మీకు కల్పిస్తామని సభాముఖంగా హామీ ఇస్తున్నామని అన్నారు. గృహంలో అమ్మాయి జన్మించగానే ముందుగా తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తారని మనం కూడా మనకు వెనక ఒక పురుషుడు తోడు ఉండాలని మనం ఎప్పుడైనా అమ్మాయితో పాటు అబ్బాయి కూడా ఎంతో అవసరమని మొదలు మనం తండ్రి నీడలో తదుపరి భర్త నీడలో మనకు తనయుడు కూడా ఉంటే ప్రతి మహిళకు చేదోడు వాదోడుగా జీవనం కొనసాగుతుందని గుర్తు చేశారు. పురుషులకు దీటుగా స్త్రీలు కూడా నేడు అన్ని విధాలుగా అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్నారని నేడు మహిళలు ఎన్నో రంగాలలో అభివృద్ధి చెందిన కొన్ని విషయాలను వారికి గుర్తు చేశారు. అలాగే గ్రామంలో అందరూ ఆరోగ్య వంతులుగా ఉంటూ అనారోగ్యానికి గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మనకు అందుబాటులో ప్రాథమిక కేంద్రం కూడా మన గ్రామంలో ఉండటం ఇదే కాకుండా ఎలాంటి జబ్బులు లేకుండా హైదరాబాదుకు తీసుకువెళ్లి ఆరోగ్య సమస్యలను పరిష్కరించే విధంగా వైద్యులను సంప్రదించటం జరిగిందని గతంలో కూడా గ్రామస్తుల కొందరిని హైదరాబాద్కు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించి తగిన వైద్య పరంగా అన్ని సేవలు అందించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా మహిళలు ఏ విషయంలోనైనా ముందుండి గ్రామాన్ని గ్రామపంచాయతీకి ఎంతో పేరు తీసుకొచ్చే విధంగా సర్పంచ్కి సహకరించాలని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుధాకర్, గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామసభ విజయవంతం చేశారు.

## హనుమకొండ బూత్ స్థాయి సమ్మేళనానికి బయలుదేరిన మల్లంపల్లి మండల బీజేపీ నాయకులు




**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 29: (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న బూత్ స్థాయి సమ్మేళన కార్యక్రమానికి మల్లంపల్లి మండల బీజేపీ నాయకులు మంగళవారం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండిగా వెంకన్న, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీష్, మాజీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాయకంటి పరమేష్, బొమ్మ రతిసారన్న, మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి, బండి బాబు, కొండా యుగేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎండిగా రాజు, మండల కార్యదర్శులు గూడెల్లి కొమురెల్లి, పోతారాజు సంపత్, రేగురి రాజిరెడ్డి, చింత నిప్పుల రాజన్న, మాలోత్ యాకుబ్, భూక్యా వెంకటేష్, గుంటుక సురేష్, దండిగా అనిల్, ముక్కామ్లా రంజిత్, నునావత్ నరేందర్, గుండా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పిట్టల చంద్రశేఖర్‌కు ఘన నివాళి.. ప్రథమ వర్ధంతిలో పాల్గొన్న మున్నూరుకాపు ప్రముఖులు



**ఖమ్మం, ప్రతినిధి జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):**నాగార్జున గ్రామీణ బ్యాంక్ మాజీ ఉద్యోగి స్వర్గీయ పిట్టల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఖమ్మం సారథి నగర్‌లోని ఆయన స్వగృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖులు తోట రామారావు, కనకం జనార్ధనరావు తదితరులు హాజరై చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రశేఖర్ బ్యాంకు ఉద్యోగిగా అందించిన సేవలను, ఆయన నిబద్ధతను గుర్తు చేసుకున్నారు. సమాజంలో ఆయనకు ఉన్న ప్రత్యేక గుర్తింపు, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావాన్ని కొనియాడారు. అనంతరం ఆయన సతీమణి అనురాధ, తమ్ముడు పిట్టల దయానంద్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. స్వర్గీయ చంద్రశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శెభాష్ రమణ, రాకం రాంబాబు, ఆకుల సత్యనారాయణ, విప్ప చంద్రమోహన్, పిట్టల దయానంద్, వొల్లిశెట్టి నర్సయ్య, ఆకుల సురేష్, బషీకర్ల తన్మయ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సేవలకు ఘన వీడ్కోలు.. గోపాలరావు-కళావతి దంపతులను సత్కరించిన ఆకుల గాంధీ





**ఖమ్మం, ప్రతినిధి జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాలరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఘన సన్మానం అందుకున్నారు. ఖమ్మం వాస్తవ్యులైన ఆయన రఘునాథపాలెం మండలం గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సహచర ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, వనం శ్రీనివాసరావు, ఆకుల సురేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలరావు-కళావతి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం గోపాలరావు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడుతూ, ఆయన విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొని గోపాలరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఖమ్మం ప్రజలకు అరుదైన వైద్య అవకాశం..

### మెడికవర్ హైటెక్ సిటీ హైదరాబాద్ వాస్కులర్ సర్జన్ డా. జ్ఞానేంద్ర రెడ్డి ఎద్దుల రాక

### జులై 1న శ్రీ కూరపాటి చిల్డ్రన్ & మల్టీ స్పెషాలిటీ, స్వాతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో వైద్య సేవలు

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెంట్ వాస్కులర్ & ఎండోవాస్కులర్ సర్జన్ డా. జ్ఞానేంద్ర రెడ్డి ఎద్దుల ఖమ్మం రానున్నారు. ఖమ్మం వైరా రోడ్‌లోని శ్రీ కూరపాటి చిల్డ్రన్ & మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు నెహ్రూ నగర్ హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎదురుగా ఉన్న స్వాతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జులై 1వ తేదీ బుధవారం ఆయన ప్రత్యేక వైద్య సంప్రదింపులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వెరికోస్ వెయిన్స్, షుగర్ వ్యాధిగ్రస్తుల కాళ్ల పుండ్లు (డయాబెటిక్ ఫుట్ అల్సర్), గ్యాంగ్రీన్, బోదకాలు, అకస్మాత్తుగా తగ్గిన రక్త ప్రసరణ, కెరోటిడ్ వ్యాధులు, వాస్కులర్ మాల్‌ఫార్మేషన్స్, ప్రమాదాల్లో దెబ్బతిన్న రక్తనాళాలు, డీప్ వెయిన్ థ్రాంబోసిస్, కిడ్నీ రోగులకు డయాలసిస్ ఏవీ ఫిస్టులా, అయోటిక్ ఎన్యూరిజమ్ తదితర సమస్యలకు వైద్య సలహాలు అందించనున్నారు. డా. జ్ఞానేంద్ర రెడ్డి ఎద్దుల మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 3:30 గంటల వరకు శ్రీ కూరపాటి చిల్డ్రన్ & మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో, అలాగే మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు స్వాతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. వాస్కులర్ సమస్యలు, వెరికోస్ వెయిన్స్, డయాబెటిక్ ఫుట్ అల్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డా. జ్ఞానేంద్ర రెడ్డి ఎద్దుల వద్ద వైద్య సంప్రదింపులు పొందాలని కోరారు.



## శాంతినగర్లో జేసీబీతో డ్రైనేజీ ప్రక్షాళన

**• కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి**




**కల్లూరు, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ 19వ వార్డులో ఎన్నో రోజులుగా అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరాస్వామి తనదైన శైలిలో ప్రక్షాళన చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని జేసీబీ సహకారంతో తొలగించి నీటి ప్రవాహాన్ని సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు కౌన్సిలర్ సేవలను అభినందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ ఆదర్శనీయమని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాధా వీరాస్వామి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొండూరి కిరణ్ కుమార్, శాంతినగర్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని కౌన్సిలర్ తెలిపారు.

## పిసిడబ్ల్యూ న్యూస్ జర్నలిస్టును సన్మానించిన గ్రామ సర్పంచ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్



**తొర్రూర్ ప్రతినిధి, జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** విలేకరులు అనగానే కొంతమందిలో కొన్ని రకాల అపోహలు ఉంటాయి. విలేకర్ అంటేనే అన్ని రకాల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ఆయా పనిని బట్టి అధికారులకు తెలపటం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండేది విలేకరులు మాత్రమే. విలేకరులు అంటే గతంలో ప్రతి ఒక్కరిలో ఎంతో గౌరవం ఉండేది. ప్రస్తుత సమాజంలో కొందరు విలేకరులు చేసే తప్పుడు పనుల వలన పేరున్న విలేకరుల పేర్లు కూడా చెడు నడవడిక నడుస్తున్న వారి జాబితాలోనే చేరుతుంది. అలా అని అందరూ విలేకరులు చెడు మార్గం పోకుండా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేసే వారు కూడా లేకపోలేదు. ప్రస్తుత సమాజంలో ఎక్కడ తప్పు జరుగుతుందో అందరికీ తెలిసిన విషయమే?. ప్రజల సమస్యలు, రైతుల సమస్యలు ,విద్యార్థుల సమస్యలు ,గ్రామస్తుల సమస్యలు ఇలా ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయి. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో గల మోడల్ స్కూల్లో 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ తోరూర్ బస్టాండ్ నుండి రావడానికి ఒక బస్సును మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో ఒక బస్సు సరిపోక విద్యార్థులు అనేక అవస్థలను ఎదుర్కొంటూ ఒకే బస్సులో 140 నుండి 160 మంది విద్యార్థులు ప్రయాణం చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర్ స్వామి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై గతంలో ఉన్న డి ఎం పద్మావతి దృష్టికి తీసుకువెళ్లగా వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి రెండవ బస్సు ఏర్పాటుచేసేందుకు వీలు కల్పిస్తామని అన్నారు. నర్సంపేట నుండి తొర్రూర్ కు వచ్చే నర్సంపేట డిపో బస్సులు మోడల్ స్కూల్ వద్ద ఆపడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రస్తుతం ఉన్న డిఎం ప్రసూన లక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా నెల రోజులపాటు మోడల్ స్కూల్ ప్రాంతంలో బస్సులను ఆపే విధంగా ప్రత్యేకంగా ఒక కంట్రోలర్ ఏర్పాటు చేస్తామని బస్సులు ఆపే విధంగా చూడడం జరుగుతుందని అన్నారు. ఈ విషయంపై నర్సంపేట డిపో బస్సు డ్రైవర్లను వివరణ కోరగా ఆ సమయంలోనే బస్సులో అనేకమంది ప్రయాణికులు ఉంటున్నారు విద్యార్థులు ఎక్కలేని పరిస్థితిలో ఉండటంతో మేము బస్సులను ఆపలేకపోతున్నామని వారు వివరణ ఇచ్చారు. మోడల్ స్కూల్ విద్యార్థుల అవస్థలను గమనించి ప్రస్తుత డిఎం రెండవ బస్సు ఏర్పాటు లేదా నర్సంపేట బస్సులను నిలిపి విద్యార్థులను తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ నాగేశ్వర్ తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు కూడా కోరుతున్నారు. గుర్తురు గ్రామానికి చెందిన మనోహర్ స్వామి పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు అందరికీ అందుబాటులో ఉంటూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ నందుకు గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ తో పాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ సన్మానించారు.

## ఈ సమావేశానికి ప్రతిఒక్కరూ ఆహ్వానితులే...

**- రైతులు మరియు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

**తొర్రూరు ప్రతినిధి, జూన్ 30(పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని రైతు వేదిక లో రైతు భరోసా కంపెనీ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నది. నేటి మధ్యాహ్నం మూడు గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించబడునున్న రైతు భరోసా సదస్సు ప్రారంభ కార్యక్రమానికి గుర్తురు, మడిపల్లి, కంఠాయపాలెం, సోమవారం కుంట తండా రైతులందరూ ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా వ్యవసాయ విస్తరణ అధికారి కంటాయపాలెం క్లస్టర్ వ్యవసాయ శాఖ తొర్రూర్ వారు ఒక ప్రకరణ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. రైతు వేదిక తొర్రూర్ లో సమయ మూడు గంటలకు ప్రారంభించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమం కొనసాగనుంది.

## అర్హులైన నిరుపేదలందరికీ వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్




**కరీంనగర్, జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హులైన నిరుపేద లబ్ధిదారులందరికీ తక్షణమే డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున లబ్ధిదారులతో కలిసి దరఖాస్తులను జిల్లా అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, కరీంనగర్ పట్టణంలో గత రెండు దశాబ్దాలుగా సొంత ఇల్లు లేక కిరాయి గృహాల్లో జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలు, కూలీ కార్మికులు, వితంతువులకు గృహాల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇటీవల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఆయన, అధికార పార్టీ నాయకుల అనుచరులతో పాటు అనర్హులకు కూడా ఇళ్లు కేటాయించారన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించి, అనర్హుల కేటాయింపులను రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లేకపోతే పేదలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బండారి శేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేతతో పాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సహనాన్ని పరీక్షించొద్దు..!

### - ఆరోగ్య హక్కుల కోసం ఉద్యమ బాటలో ఆరు వేల మంది వృద్ధ ఉద్యోగులు

### - హెల్త్ కార్డులపై ప్రభుత్వ జాప్యానికి ఖమ్మం నుంచే హెచ్చరిక

### - సేవ చేసిన చేతులకు భరోసా కావాలి... మాటలు కాదు, కార్యాచరణ కావాలి

### - రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జీవితాంతం ప్రభుత్వ సేవలో తమ యవ్వనాన్ని, శ్రమను, అనుభవాన్ని అర్పించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ప్రశాంత జీవితం గడపాలని ఆశిస్తారు. అయితే, నేడు అదే పెన్షనర్లు తమ కనీస ఆరోగ్య హక్కుల కోసం మరోసారి ఉద్యమ బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొనడం ఆవేదన కలిగిస్తోంది. ఖమ్మంలోని పెన్షనర్స్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఎమ్మార్వో రామడుగు రవీందర్‌రావు అభినందన సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నెహ్రూ నగర్ యూనిట్ గౌరవాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ, ఉద్యోగులు, పెన్షనర్లకు మంజూరు చేయాల్సిన హెల్త్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. జూన్ నెల వేతనాల నుంచి ప్రతి పెన్షనర్ మూల వేతనం నుంచి 1.5 శాతం చొప్పున కోత విధించినప్పటికీ, ఇప్పటివరకు ఆరోగ్య కార్డులపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఏ ఆసుపత్రుల్లో ఏయే వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయో కూడా వెల్లడించకుండా కేవలం వేతనాల్లో కోతలు విధించడం వృద్ధ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు డబ్బులు వసూలు చేస్తూ, మరోవైపు హక్కులను నిలిపివేయడం సమంజసం కాదు. జీవితాంతం ప్రజాసేవ చేసిన ఉద్యోగుల ఆరోగ్య భద్రతను నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వానికి తగదు" అని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు రిటైర్డ్ ఉద్యోగుల హార్దిక ప్రయోజనాలను విడుదల చేయాలని ఆదేశించినప్పటికీ, వాటి అమలులోనూ ప్రభుత్వం జాప్యం చేస్తోందని నాయకులు విమర్శించారు. ఈ నిర్లక్ష్యంతో అనేక మంది వృద్ధ పెన్షనర్లు మానసిక వేదనకు గురవుతున్నారని, అయినా పాలకుల్లో చలనం కనిపించకపోవడం బాధాకరమన్నారు. జూలై మొదటి వారంలో ఖమ్మంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించిన వారు, జిల్లాలోని సుమారు ఆరు వేల మంది పెన్షనర్లు ఉద్యమంలో పాల్గొననున్నట్లు హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, మాటలతో కాలయాపన కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం రిటైర్డ్ ఎమ్మార్వో, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి రామడుగు రవీందర్‌రావు మాట్లాడుతూ, సంఘం అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేశానని, నేడు పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు ఉద్యమాలే పరిష్కార మార్గమని పేర్కొన్నారు. ప్రతి పోరాటంలో తాను ముందుండి పాల్గొంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సేవలో జీవితాన్ని అర్పించిన వారికి వృద్ధాప్యంలో భరోసా ఇవ్వడం ప్రభుత్వం యొక్క నైతిక బాధ్యత. పెన్షనర్ల కష్టాలను అర్థం చేసుకుని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించడమే నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనం. లేనిపక్షంలో ఖమ్మం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాన్ని మేల్కొలిపే ప్రజా స్వరంగా మారడం ఖాయం. ఈ కార్యక్రమంలో జిల్లా హార్దిక కార్యదర్శి ఆర్. వెంకట్ నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉపేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచందర్‌రావు, దుర్గాదేవి, జిల్లా కార్యదర్శులు జనార్ధన్, ఖాజా మొయినుద్దీన్, నెహ్రూ నగర్ శాఖ కార్యదర్శి డి. రమేష్, నాయకులు వెంకటేశ్వర్లు, చారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి అధికారుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి

**• సత్తుపల్లి ఏరియాలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం**






**సత్తుపల్లి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సింగరేణి అధికారుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎస్సిసిఎల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. జూన్ 29 నుంచి జూలై 13 వరకు ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.మొదటి రోజు వి. వేమా రెడ్డి, ఏ. అవినాష్ (డిప్యూటీ మేనేజర్), కె. రాజేష్ (డిప్యూటీ మేనేజర్), ఏ. ప్రదీప్ కుమార్ (జాయింట్ సెక్రటరీ, డి. శ్రీనివాస్ (ట్రెజరర్) నిరాహార దీక్షలో కూర్చున్నారు.వీరికి సత్తుపల్లి ఏరియాలోని ప్రాజెక్టు అధికారులు, ఎన్వీఆర్ ప్రహ్లాద్, ఏఎల్ఎస్వి సునీల్ వర్మ, బొల్లం శ్రీనివాస్, కె. సోమశేఖర్, డి. రమేష్ బాబు (వైస్ ప్రెసిడెంట్), వివిధ ప్రాజెక్టుల ఇంజనీర్లు, అధికారులు సంఘీభావం ప్రకటించారు. సింగరేణి అధికారులకు కోల్ ఇండియా తరహాలో పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పిఆర్పి బకాయిలను వెంటనే చెల్లించాలని, కోల్ ఇండియా అధికారులతో సమానంగా అలవెన్సులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘం డిమాండ్ చేసింది.సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న అధికారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్చలు జరిపి పరిష్కరించాలని నాయకులు కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో సంఘ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు రిలే నిరాహార దీక్షలను కొనసాగించనున్నట్లు తెలిపారు.

# కరీంనగర్ కార్ఖానా గడ్డ ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**• ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్**



**కరీంనగర్ టౌన్ జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని కార్ఖానా గడ్డసర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని, భూమిని అక్రమమించడానికి ప్రయతిస్తున్న కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం రోజున ప్రజా వాణి లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి ఫోర్జరీ ప్రోసీడింగ్ నెంబర్ B1 /635/06 ద్వారా 11, 14 గుంటల భూమినీ, కల్లేపల్లి బలరాజు అనే వ్యక్తి ఆక్రమించుకు న్నారని ఆరోపించారు. అక్రమంగా ఆక్రమించిన ఈ స్థలాన్ని, డాక్యుమెంట్ నెంబర్ 5036/2021 ద్వారా కల్లేపల్లి కనకమ్మ నుంచి తనకు గిఫ్ట్ డీడ్ (బహుమతి) కింద వచ్చినట్లుగా సృష్టించి, బలరాజు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కార్పొరేటర్ వివరించారు. అంతేకాకుండా, ఆ స్థలం నుంచి సుమారు 779 గజాల స్థలాన్ని అక్రమంగా విక్రయించారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కుల నుంచి కాపాడాలని, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడిన కల్లేపల్లి బలరాజుపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని రక్షించాలని కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

# పేదలు ఇంటి స్థలం అడిగితే అరెస్టు చేస్తారా!

**- అరెస్టు చేసిన ప్రజలను, సిపిఎం నాయకులను వెంటనే విడుదల చేయాలి**


**- సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** పేదలు ఇళ్ళ స్థలాలు అడగటం కోసం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వస్తే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించటాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజలకు మద్దతుగా వెళ్ళిన సత్తుపల్లి డివిజన్ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, డివిజన్ శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా నాయకులు జాజిరి శ్రీను, మోరంపూడి పాండు రంగారావుతో సహా అనేక మంది కార్యకర్తలను అరెస్టు చేశారన్నారు. సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, టౌన్ కార్యదర్శి సర్వేశ్వరరావు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజాబాబులను తెల్లవారకముందే ఇండ్ల నుండి అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన, ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. బేషరతుగా అరెస్టు చేసిన ప్రజలతో సహా నాయకులందరినీ విడుదల చేయాలని నున్నా పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు.కాకర్లపల్లికి చెందిన పేదలు సంవత్సర కాలంగా ఎండిఓ నుండి కలెక్టర్ వరకు, ఎమ్మెల్యే, మంత్రి చుట్టూ తిరిగి అలసిపోయారన్నారు. సిపిఎం పార్టీ నాయకులు ఎన్‌టిఆర్ పాత కాలవ స్థలాన్ని చదును చేస్తే 15 వందల మందికి స్థలాలు ఇవ్వవచ్చు అని గుర్తించి, అధికారులు, మంత్రుల దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అందరూ సానుకూలంగా స్పందించనా, స్థానిక కాంగ్రెస్ నాయకుల వత్తిడికి తలొగ్గి ఎమ్మెల్యే మట్టా రాగమయి స్థలాలు పేదలకు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని నున్నా ఆరోపించారు. పేదలందరికీ ఇళ్ళ స్థలాలు ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# గుర్తుర్‌లో శుక్రవారం నుండి బుధవారానికి మారిన వారసంత





**తొర్రూరు ప్రతినిధి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత నాలుగు వారాల నుండి ప్రారంభించాలనుకున్న వారసంత గుర్తుర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆలస్యమైనప్పటికీ గత వారం ఎట్టకేలకు ఎంతో అష్టాహసంగా శుక్రవారం నాడు ప్రారంభించారు. ప్రారంభం రోజే విశేష స్పందన కలిగిన వారసంత ఒకరోజులోనే ఎన్నో గ్రామాలకు ప్రచారం అయింది. ప్రస్తుతం సోమవారం జరిగిన మహిళా సభలో వారాంతపు సంతను శుక్రవారం నుండి బుధవారం కు మార్చిడి చేశారు. శుక్రవారం వారసంతను ఏర్పాటు చేస్తే ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూరగాయల వారికి వివిధ ప్రాంతాలలో పెద్దవార సంతలు ఉన్నాయని అందుకు రాలేకపోతున్నామని బుధవారం రోజు ఏర్పాటు చేస్తే అనేకమంది వచ్చేందుకు వీలు కలుగుతుందని వారు తెలపడంతో సానుకూలంగా స్పందించిన గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ మహిళా సమావేశంలో అందరి సలహాలను తీసుకున్నారు. మహిళలందరూ శుక్రవారం నుండి బుధవారానికి మార్చడం వల్ల ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. రేపటి బుధవారం నుండి ప్రతి బుధవారం గ్రామ క్రీడా మైదానంలో వారసంత కొనసాగుతుందని గ్రామ ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తూ తెలిసిన వారందరికీ తెలియపరచాలని కోరారు. వర్షాకాలం కావటం వల్ల ప్రస్తుతానికి ప్లాస్టిక్ కవర్లతో కూరగాయలు అమ్ముకునే విధంగా చిన్న షెడ్డు లాగా ఏర్పాటు చేస్తామని అన్నారు.

# సీతాఫల్‌మండి టిఆర్ టీ కాలనీలో అక్రమ నిర్మాణాలు.?

**జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?**

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని స్థానికుల ఆరోపణలు**

**ఫిర్యాదులు ఉన్న అధికారుల చర్యలు ఎందుకు లేవని ప్రశ్నలు**

**వర్క్ ఆపాలని నోటీసులు ఎక్కడ.? మున్సిపల్ చట్టం అందరికీ ఒకటే కాదా.?**

**విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవాలు వెల్లడించాలని స్థానికుల డిమాండ్**



**హైదరాబాద్ జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** సీతాఫల్‌మండి టిఆర్ టి కాలనీలో జరుగుతున్న ఓ అక్రమ నిర్మాణం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణం అనుమతులకు పూర్తి విరుద్ధంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు కనీస చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవేళనిర్మాణం చట్టబద్ధంగా జరుగుతుంటే ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, నిర్మాణదారుడు నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే స్థానికుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు అధికారులు అమ్ముడుపోయారనే సందేహాలను పెంచుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణంగా అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం స్టాప్ వర్క్ నోటీసులు, షోకాష్ నోటీసులు అవసరమైతే సీజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ అక్రమ నిర్మాణం విషయంలో అలాంటి చర్యలు తీసుకున్నారా.? లేదా.? లేకుంటే ఎందుకు తీసుకోలేదు.? అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి లంచాలు తీసుకున్నారా.? అనే విషయంపై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒకవేళ నోటీసులు జారీ చేసి ఉంటే వాటి వివరాలను బహిర్గతం చేయాలని, చేయకపోతే కారణాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని పలుమార్లు ప్రకటించింది. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న నేపథ్యంలో ఈ అక్రమ నిర్మాణంపై కూడా అదే ప్రమాణాలు అమలు అవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణ ప్రజల విషయంలో వెంటనే చర్యలు తీసుకుంటూ బడా బాబుల, బిల్డర్ల విషయంలో అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని భావన ప్రజల్లో ఏర్పడితే కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, జోనల్ సిపి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, స్థల పరిశీలన నివేదిక, ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు పత్రికా ముఖంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణదారుడు చట్ట ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.సీతాఫల్‌మండి టి ఆర్ టి కాలనీలో జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణంపై స్టేట్ విజిలెన్స్ అధికారులు చే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేసి అక్రమ నిర్మాణం అని తేలితే కూల్చివేతలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత తార్నాక సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# సమాజ సేవే జీవన ధ్యేయం...

**• ఘనంగా డాక్టర్ భరద్వాజ్ జన్మదిన వేడుకలు • తాత కత్తుల శాంతయ్య ఆశయాలకు వారసుడిగా పేదల సేవలో నిరంతర ప్రయాణం • ఉచిత వైద్య సేవలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, దివ్యాంగులకు ఫ్రీ ఫిజియోథెరపీ అందిస్తానని సంకల్పం**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వైద్య వృత్తిని కేవలం ఉపాధి సాధనంగా కాకుండా, మానవ సేవకు అంకితమైన మహత్తర బాధ్యతగా భావిస్తూ, పేదల కష్టాల్లో అండగా నిలుస్తున్న యువ శ్రీ ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ భరద్వాజ్ జన్మదిన వేడుకలు ఖమ్మం నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.గత నాలుగు సంవత్సరాలుగా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తున్న డాక్టర్ భరద్వాజ్ తన తాతగారు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కత్తుల శాంతయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన జీవిత లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు."సమాజం నాకు ఎంతో ఇచ్చింది... ఇప్పుడు సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత నాదే" అనే భావనతో ముందుకు సాగుతున్న ఆయన, చిన్నా పెద్దా, పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. వైద్య సేవలతో పాటు పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.బడుగు, బలహీన వర్గాల ప్రజలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, ముఖ్యంగా అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి పూర్తిగా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు తాను కట్టుబడి ఉన్నానని ఆయన వెల్లడించారు. ప్రతి మనిషి ఆరోగ్యవంతంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు."వైద్యుడు రోగాన్ని మాత్రమే నయం చేయకూడదు... మనిషిలో ఆశను, ఆత్మవిశ్వాసాన్ని నింపాలి" అనే విలువలను ఆచరణలో చూపిస్తూ డాక్టర్ భరద్వాజ్ సేవలు కొనసాగిస్తున్నారు. అందుకే ఆయన జన్మదినం కేవలం కుటుంబ వేడుకగా కాకుండా, సేవా సంకల్పానికి నూతన ప్రతిజ్ఞగా నిలిచింది.తాత కత్తుల శాంతయ్య ప్రజాసేవా వారసత్వాన్ని కొనసాగిస్తూ, మానవత్వమే మహోన్నత మతమనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న డాక్టర్ భరద్వాజ్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సేవ చేయాలనే తపన, పేదల పట్ల మమకారం, విద్యపై నిబద్ధత ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది బాలు, వెంకటేష్, సురేష్, రఘు, వర్షిని, రమ్య, తోటి వైద్యులు పాల్గొని డాక్టర్ భరద్వాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడుతూ, ఇలాంటి సేవాభావం మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజల బాధను తన బాధగా భావించి, సేవనే శ్వాసగా ఎంచుకున్న వైద్యులు సమాజానికి నిజమైన ఆస్తి. అలాంటి సేవామూర్తి డాక్టర్ భరద్వాజ్ మరెన్నో సంవత్సరాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తన వంతు సేవలు అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# ఖమ్మం నుండి తెలంగాణ ఆత్మగౌరవ యాత్ర

## విజయ సంకల్పంతో జోగులాంబ పుణ్యక్షేత్రం వైపు ఉద్యమకారుల 10 కార్ల ర్యాలీ

## త్యాగాలకు గుర్తింపు దక్కాలనే ఆకాంక్షతో మళ్లీ ఏకమైన తెలంగాణ పోరాట వీరులు

## కాంగ్రెస్ హామీల అమలుకు కృతజ్ఞతగా 33 జిల్లాల ఉద్యమకారుల మహా సంగమం







**ఖమ్మం ప్రతినిధి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాధన కోసం జీవితాలను అంకితం చేసిన ఉద్యమ వీరుల అడుగులు మరోసారి ఒకే దారిలో సాగాయి. ఉద్యమ స్ఫూర్తిని, త్యాగాల గౌరవాన్ని, ఆత్మగౌరవ సంకల్పాన్ని చాటుతూ ఆదిలాబాద్ నుంచి జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ వరకు చేపట్టిన "విజయ సంకల్ప యాత్ర"లో భాగంగా ఖమ్మం జిల్లా నుంచి పది కార్లతో తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా బయలుదేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ తల్లి నినాదాలతో, ఉద్యమ గీతాల మధ్య ప్రారంభమైన ఈ యాత్ర భావోద్వేగపూరిత వాతావరణాన్ని సృష్టించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి. కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు లభించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆ ఆశలు నెరవేరకపోయినా, ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు ప్రారంభించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి కే. కేశవరావు కమిటీని ఏర్పాటు చేసి, ఆ దిశగా చర్యలు చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో తమ త్యాగాలు, పోరాటాలు, జైలు జీవితం, ఆత్మగౌరవం కోసం చేసిన నిరంతర కృషి ఎన్నటికీ మరువలేనివని గుర్తు చేశారు. ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న కమిటీ చైర్మన్ కే. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, మంత్రులు పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభా నాగిరెడ్డిలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "తెలంగాణ సాధనతో ముగియలేదు మా పోరాటం… తెలంగాణ సాధించిన వారందరికీ గౌరవం దక్కే వరకు మా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది" అని ఉద్యమకారులు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి జోగులాంబ అమ్మవారి సన్నిధి వరకు 101 కార్లతో నిర్వహిస్తున్న ఈ విజయ సంకల్ప యాత్ర, కేవలం ఒక ర్యాలీ మాత్రమే కాదు; అది తెలంగాణ చరిత్రకు, త్యాగాలకు, ఆత్మగౌరవానికి అంకితమైన ప్రజా ప్రస్థానం అని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ కోసం చెమటోడ్చిన, కన్నీరు కార్చిన, జీవితాలను అర్పించిన ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వానిదీ నైతిక బాధ్యత అని, వారి త్యాగాలకు సరైన గుర్తింపు ఇవ్వడమే నిజమైన స్వర్ణ తెలంగాణకు పునాది అని ఈ విజయ సంకల్ప యాత్ర మరోసారి చాటి చెబుతోంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు బచ్చల పద్మచారి, మహిళా ఉద్యమకారుల జిల్లా అధ్యక్షురాలు రెడ్డిబోయిన వరలక్ష్మి, సీనియర్ జర్నలిస్ట్ రజనీకాంత్, మధుగౌడ్, శ్రీనివాస్ నాయక్, భరత్ చంద్ర, నరసింహాచారి, షేక్ అబ్బాస్ అలీ, బానోతు రమేష్, మోతుకూరి వెంకటేశ్వరాచారి, అశోక్ సింగ్, అల్లిక సంతోష్ యాదవ్, కమలమ్మ, ధనలక్ష్మి, యాకలక్ష్మి, కామని అనంతలక్ష్మి, వసీం ఖాన్, ఆసిఫ్, గాజుల రవి, గాలి రాము గౌడ్, ఇనుప శ్రీను, ఇనుప సుందరరావు, బాబు నారపొంగు, వెంకటికోటి కూటి, ఊరుకూరు అంకాలు, షేక్ యాకోబు, కోసూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా..

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## - రైతు భరోసా పంపిణీ అనంతరం ఘనంగా రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తాం

## - రైతు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈనెల 30న చింతకాని మండలం జగన్నాధపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడాతూ.. వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవనున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు.

అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు. యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 33వ డివిజన్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి.. భారీగా పాల్గొన్న ప్రజలు

**కరీంనగర్, జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** 33వ డివిజన్ హుస్సేనిపురాలో ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో ఓటర్ల గణన, నమోదు ప్రక్రియ ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో విజయవంతంగా పూర్తయింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మార్గదర్శకత్వంలో, స్థానిక నాయకుడు యాసిర్ అర్ఫత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 33వ డివిజన్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటరు నమోదు, సవరణలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను సమర్పించారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) ఫైలింగ్ కార్యక్రమంలో ఏఐఎంఐఎం కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. ఇన్షా అల్లాహ్, ఓటరు నమోదు ప్రక్రియను మరింత విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు.

# హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్టా?లేనట్టా.?

## మున్సిపల్ ఎలక్షన్, సర్పంచ్ ఎలక్షన్ తర్వాత కార్యకర్తలను పట్టించుకోవడం లేదు అంటున్న కార్యకర్తలు.

## హుజురాబాద్ నియోజకవర్గంలో నాయకుల కార్యకర్తల మధ్య చర్చనీయంగా మారిన కాంగ్రెస్




**హుజురాబాద్ జూన్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఉన్నట్టా?లేనట్టా?అనేదే చర్చనీయంగా మారింది. కొంత మంది చెప్పుడు మాటల వలన నాయకులు కార్యకర్తలను పార్టీ సిద్ధాంతాల ను నమ్ము కున్న వ్యక్తులను దూరం చేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఇది చర్చ నీయంగా కనిపిస్తుంది. మున్సిపల్ ఎలక్షన్, సర్పంచ్ ఎలక్షన్ తర్వాత కార్యకర్తలను పట్టించుకోవడం లేదు అంటున్న కార్యకర్తలు. ఈ మధ్య ఒక మీటింగ్ లోపార్టీలో ఉంటే ఉండచ్చు, లేకపోతే వేరే పార్టీలకు వెళ్లొచ్చు అన్న మాట కూడా చర్చ నీయంగా మారింది. ఈ విషయం లేటుగా బయటికి రావడంతో ఇటు నియోజక వర్గ ప్రజలు, అటు కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలలో కానీ ముఖ్య మైనటువంటి కార్యక్రమాలలో గాని అసలు కార్యకర్తలు కనబడటం లేదు? ఎందుకు? నాయకులు, కార్యకర్తలు హాజరు కాకుండా ఇలా వాళ్ళ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నాయకులు మారుతారా? కార్యకర్తలను కలుపుకొని పోతారా వేచి చూడాల్సిందే? అని ముందు ముందు కార్యకర్తల పరిస్థితి ఏంటి? వారిని నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితి ఏంటి అని అన్నారు.

# మెగాఫోన్ పట్టిన రామ్.. ఘనంగా పూజా కార్యక్రమాలు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన 23వ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. =ర్యాపో23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ నిర్మాత స్రవంతి రవికిశోర్ ఈ కార్యక్రమానికి హాజరై క్లాప్ కొట్టగా, రామ్ తండ్రి మురళీ పోతినేని కెమెరా స్విచ్ ఆన్ చేసి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని రామ్ సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు హీరో రామ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండడం విశేషం. సోషల్ మీడియాలో "ది లోన్ వోల్ఫ్ జర్నీ బిగిన్స్" అనే క్యాప్షన్ తో ఈ సినిమాపై ఆసక్తిని పెంచారు. దీన్నిబట్టి ఇదొక యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి.

ఈ సినిమాకు భారీ టెక్నికల్ టీమ్ పనిచేయనుండటం విశేషం. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరు కెమెరా బాధ్యతలు చేపట్టగా, స్టార్ ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా ఎ.ఎస్. ప్రకాశ్




వ్యవహరించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# 'జై భీమ్' కాంబో రిపీట్..
## కేజీఎఫ్ నిర్మాతలతో సూర్య కొత్త సినిమా




తమిళ స్టార్ హీరో సూర్య మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'జై భీమ్' తర్వాత ఆయన మరోసారి దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో జతకట్టారు. 'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్లను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం విశేషం. ఈ సినిమా ముహూర్తపు వేడుకను సోమవారం (జూన్ 29) చెన్నైలో ఘనంగా నిర్వహించారు. సూర్య, హోంబలే ఫిల్మ్స్ కాంబినేషన్‌లో ఇదే తొలి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ సినిమాలో సూర్య సరసన హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తోంది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎస్.ఆర్. కతిర్ సినిమాటోగ్రాఫర్‌గా, ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పనిచేయనున్నారు. కమర్షియల్ అంశాలతో కూడిన ఒక పవర్‌ఫుల్, గ్రిట్టి డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే రజనీకాంత్‌తో 'వెట్టైయాన్' సినిమాను తెరకెక్కించిన జ్ఞానవేల్, వెంటనే సూర్యతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్, సూర్య మూడు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని, సినిమాల ఎంపికలో ఆయన నిర్భయ వైఖరిని ప్రశంసించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే శక్తివంతమైన, అర్థవంతమైన కథలను అందించాలన్నదే తమ ఉమ్మడి లక్ష్యమని నిర్మాత విజయ్ కిరగందూర్ పేర్కొన్నారు. ఇటీవలే 'కరుప్పు' చిత్రంతో విజయం అందుకున్న సూర్య, ఈ కొత్త ప్రాజెక్టుతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించనున్నారు.

"ఇది ఆయన నిర్మించుకున్న కెరీర్. ఫ్రేమ్ ఫ్రేమ్‌కూ, సినిమా సినిమాకూ, ఫైట్ ఫైట్‌కూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారు. ఎన్నో నిజ జీవితాల బరువును మోసే పాత్రలలో జీవించారు. ఆయన కెరీర్ ప్రతీసారీ సౌకర్యాన్ని కాదని, ధైర్యాన్ని ఎంచుకుంది. మూడు దశాబ్దాలుగా తెరపై సత్యాన్ని ఆవిష్కరిస్తూ, తెర వెనుక కోట్లాది హృదయాలను గెలుచుకున్నారు.

ఈ తరం అత్యంత నిర్భయ నటుడు, ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత భారీ వేదికపైకి అడుగుపెడుతున్నారు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం మాకు దక్కింది. హోంబలే ఫిల్మ్స్ తరఫున 'ది వన్ - సూర్య'కు మేము గర్వంగా స్వాగతం పలుకుతున్నాము. సూర్య గారితో మా ఈ ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆయన నటన, మా నిర్మాణ విలువలు కలిసి ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాము. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# నెగెటివిటీని పారిపోయేలా చేయాలంటే..!

ఎటు చూసినా నెగెటివిటీ.. ఏలిన్నాటి శని వెంటాడుతుంటే ఎవరైనా ఏం చేయగలరు? అసలు కంగన అంటేనే నెగెటివిటీ స్ప్రెడ్ అయిపోతోంది. అనవసరంగా నోరు పారేసుకుంటుందని, ఎంత పెద్ద స్థాయి వ్యక్తులను అయినా ఎదురిస్తుందని... నోటి దురుసు ఎక్కువ అని రకరకాలుగా పరిచయం అవుతోంది. ఇప్పటివరకూ ఇండస్ట్రీలో చాలామందితో విరోధం పెట్టుకోవడం తనకు మైనస్ గా మారింది. సినీపరిశ్రమలోనే కాదు.. రాజకీయంగాను శత్రువులున్నారు. తాను ఏం చేస్తున్నా వ్యతిరేకత... అయితే వీటన్నిటికీ అసలైన సమాధానం ఏది? పరిస్థితుల్ని తిరిగి తనవైపు తెచ్చుకునేలా పాజిటివిటీని పెంచుకోవాలంటే ఏం సాధించాలి! ...

క్వీన్ కంగనకు ఉన్న ఏకైక ఆప్షన్ సరైన బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టడం. ఒకే ఒక్క హిట్టు అన్నిటినీ మార్చేస్తుంది. వ్యాపారవర్గాలను, ఇండస్ట్రీ సహచరులను తనవైపునకు తిప్పుకునే బలం ఇస్తుంది. ఇప్పుడు క్వీన్ సీక్వెల్ తో ఇది సాధ్యమవుతుందని కంగన నమ్ముతోంది. తాజా సమాచారం మేరకు... వరుస పరాజయాల నుంచి తనను బయట పడేసేంత సక్సెస్ ని -క్వీన్ 2- ఇస్తుందని కంగన నమ్ముతోంది. తాజా సమాచారం మేరకు -క్వీన్ 2- షూటింగ్ శరవేగంగా సాగుతోంది. జూలై మొదటి వారానికి టాకీ పార్ట్ సహా చిత్రీకరణ మొత్తం పూర్తి కానుందని సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం తగినంత సమయం కేటాయించి, ఈ సీక్వెల్‌ను 2027లో భారీ ఎత్తున విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.మొదటి భాగంలో లండన్, పారిస్ వంటి విదేశీ నగరాలలో ఒంటరిగా ప్రయాణించి తనను తాను ఆవిష్కరించుకునే అమ్మాయిగా కంగనా కనిపించారు. అయితే ఈ సీక్వెల్‌లో కథాంశం భారతదేశంలోని పలు మహా నగరాల చుట్టూ తిరగబోతోంది. విభిన్న సంస్కృతులను, సరికొత్త జీవిత అనుభవాలను క్వీన్ పాత్ర ఎలా స్వీకరించిందనే కోణంలో కథ సాగుతుంది. ఈ చిత్రంలో కంగనా, తన స్నేహితులపై ఒక ప్రత్యేకమైన -దాండియా సాంగ్- ను కూడా మేకర్స్ గ్రాండ్‌గా చిత్రీకరించారు. ప్రస్తుతం కేవలం కొన్ని సీన్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి.

బాలీవుడ్ లో అసాధారణ నట ప్రతిభ ఉన్న కంగన రనౌత్ కి ఇన్నాళ్లు కాలం కలిసి రాలేదు. వరుసగా అరడజను భారీ ఫ్లాపులు రావడం నిరాశపరిచింది. అయితే ప్రతి ఒక్కరికీ ఇలాంటి ఒక బ్యాడ్ ఫేజ్ ఉంటుంది. ప్రతిభ ఉన్నా కాలం కలిసి రాదు. ఒకసారి సరైన విజయం వరిస్తే, అదే హుషారులో వరుస పెట్టి జోష్ తో అనుకున్నది సాధించుకునే వీలుంటుంది. అలాంటి ఒక మంచి హిట్టు కోసం కంగన ఇప్పుడు తపిస్తోంది. తనపై ఉన్న నెగెటివిటీని పూర్తిగా చెరిపేయడమే ఇప్పుడున్న తక్షణ కర్తవ్యం.

# భక్తి పారవశ్యంలో రవితేజ..
## ఆకట్టుకుంటున్న 'ఇరుముడి' ఫస్ట్ సింగిల్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచి ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు'ను చిత్ర బృందం విడుదల చేసింది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో సాగే ఈ గీతం, విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో విశేషమైన స్పందనను రాబట్టుకుంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ లిరికల్ వీడియోలో రవితేజ అయ్యప్ప మాలధారణలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. పూర్తి భక్తి పారవశ్యంలో ఆయన వేసిన స్టెప్పులు, హావభావాలు పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ మొదలయ్యే ఈ గీతం, ఆద్యంతం భక్తి రసాన్ని పండిస్తూ శ్రోతలను




కట్టిపడేస్తోంది. పాటలోని విజువల్స్, రవితేజ కొత్త లుక్ చూస్తుంటే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందనే ఆసక్తి రేకెత్తుతోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం అద్భుతంగా ఉంది. భక్తి గీతానికి అవసరమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఆయన తన మార్క్ చూపించారు. గాయకుడు అనంతు తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ఇక, ఈ పాటకు సాహిత్యం అందించడంలో దర్శకుడు శివ నిర్వాణ కూడా భాగం కావడం విశేషం. రచయిత కల్యాణ్ చక్రవర్తితో కలిసి ఆయన ఈ గీతాన్ని రచించారు. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. గతంలోనే ఈ సినిమాలో రెండు అయ్యప్ప భక్తి గీతాలు ఉంటాయని జీవీ ప్రకాశ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.డివోషనల్ థ్రిల్లర్ అనే విభిన్నమైన జానర్‌లో వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు కలగలిసి ఉంటాయని సమాచారం. తొలి పాటకు వస్తున్న అనూహ్య స్పందన చూస్తుంటే, సినిమా ఆడియో కూడా పెద్ద హిట్ అవుతుందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా అయ్యప్ప భక్తుల నుంచి ఈ పాటకు ప్రత్యేక ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఈ పాట, సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచడం ఖాయం. తదుపరి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లండన్ వీధుల్లో మెగా ఫ్యాన్స్ కోలాహలం..
## 'పెద్ది' విజయోత్సవంలో చరణ్‌కు అభిమానుల నీరాజనం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం కొనసాగుతోంది. ఈ సినిమా భారీ విజయం సాధించిన నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఇప్పుడు లండన్‌లో విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో పాల్గొనేందుకు లండన్ వెళ్లిన రామ్ చరణ్‌కు అభిమానులు, ప్రవాసాంధ్రులు ఎయిర్‌పోర్ట్‌లో బ్రహ్మరథం పట్టారు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఈ చిత్రానికి లభించిన అద్భుత ఆదరణకు ఈ వేడుకలు అద్దం పడుతున్నాయి.స్టైలిష్ సూట్, కళ్లద్దాలతో లండన్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన చరణ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం పోటీపడ్డారు. అనంతరం లండన్‌లోని హన్స్‌లో ఉన్న ప్రసిద్ధ సినీవరల్డ్ థియేటర్‌లో జరిగిన ప్రత్యేక ఫ్యాన్ స్క్రీనింగ్‌లో ఆయన పాల్గొన్నారు. అక్కడ అభిమానులతో కలిసి సినిమా చూస్తూ సందడి చేశారు. వారి ఆనందాన్ని దగ్గరుండి పంచుకున్నారు. 'పెద్ది' చిత్రానికి యూకేలో లభించిన ఆదరణకు కృతజ్ఞత తెలిపేందుకే ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది.'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ నెల 4న విడుదలైన ఈ సినిమా, మొదట్లో మిశ్రమ స్పందన తెచ్చుకున్నా... ఆ తర్వాత మౌత్ టాక్‌తో అద్భుత విజయం సాధించింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించిన అనంతరం, ఓవర్సీస్ అభిమానుల కోసం లండన్‌లో ఈ వేడుకను ప్లాన్ చేశారు. థియేట్రికల్ రన్ ముగిశాక, త్వరలోనే ఈ చిత్రం ఓటీటీలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది.ప్రస్తుతం లండన్ వీధుల్లో, థియేటర్ వద్ద రామ్ చరణ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానుల కోలాహలం మధ్య 'పెద్ది' సక్సెస్‌ను రామ్ చరణ్ ఎంజాయ్ చేస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది.

